రాకోయి, అనుకోని అతిథి!

శ్రీమతి కావూరి రాజ్యలక్ష్మి

మిట్ట మధ్యాహ్నం. ఎండ చిటపటలాడు తోంది. ఎండ వేడికి తట్టుకోలేక పశు పక్ష్యాదులు సైతం గూడు విడవనంటున్నాయి. పక్కనే ఉన్న చెట్టు క్రింద నిలబడి ఆత్రంగా వాచీకేసి చూసుకుంటోంది కీర్తన. ఆమె అలా చూసుకోవడం బహుశా ఇది పదవసారి అయి ఉండొచ్చు. తొందరగా ఇంటికెళ్ళాలి! ఇంటి దగ్గర నాన్నగారు ఏమి చిందులు త్రొక్కుతున్నారో ఏమో? అని దిగులుగా ఉంది. అసలే ఈ రోజు తనని కాలేజీకి వెళ్ళొద్దన్నారు. ప్రొద్దున్నే నిద్రలేస్తూనే "అమ్మాయ్ కీర్తనా! ఈ రోజు మొన్న పెళ్ళి చూపులకి వచ్చి వెళ్ళిన గోపాలరావు గారు, వాళ్ళ అబ్బాయి ప్రవీణ్ లక్నో నుండి వచ్చాడట. ఈ రోజు ప్రవీణ్‌ని పెళ్ళి చూపులకి పంపుతామని కబురు చేశారు. నువ్వు ఎక్కడికీ వెళ్ళకుండా ఈ రోజు ఇంటి పట్టునే ఉండు" అన్నారు. తండ్రి మాట ఇంట్లో శిలా శాసనం! కాని తనమో ఈరోజు తప్పనిసరిగా ప్రాక్టికల్స్‌కి హాజరు కావాలి! ఈ ఒక్క ప్రాక్టికల్‌కీ హాజరయితే డిగ్రీ పూర్తి అవుతుంది. తరువాత పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలని, ఉద్యోగం చేయాలనీ ఉబలాటంగా ఉంది కీర్తనకి. అందుకే తండ్రిని వొప్పించి, నెమ్మదిగా కాలేజీకి బయలుదేరి వచ్చింది. వాళ్ళు వచ్చేలోపే వస్తానని, పదేపదే మాటిచ్చి మరీ వచ్చింది. కాలేజీ నుండి క్లాస్ మేట్ సుజాత తన మోపెడ్ మీద ఇక్కడి బస్టాప్‌లో డ్రాప్ చేసి వెళ్ళిపోయింది. అదేమిటో ఖర్మ! రోజూ ఎన్నో బస్సులు వస్తూ పోతూ కన్పించేవి. ఈ రోజు ఒక్క బస్సూ ఈ ఛాయలకు రావడం లేదు! పెళ్ళి చూపుల వాళ్ళు వచ్చే లోపునే ఇంటికి వెళ్ళి అమ్మకి సహాయపడాలనుంది. ఈ సంబంధం తనకి నిశ్చయమయితే బాగుండునని అమ్మ ఆశపడుతోంది. గోపాలరావుగారుతహశీల్దారుగా చేసే వారట! ఆయన మొదటి భార్య మరణించగానే రెండవ భార్యని చేసుకున్నారట! ఆమెకి ఒకే ఒక్క కొడుకు ప్రవీణ్, అతనిని ఇంజనీరింగ్ చదివించి, పెద్ద ఉద్యోగస్తుడిగా చూడాలనుకున్నారట! నిజానికి ప్రవీణ్‌కి కూడా తనలాగా ఇప్పట్లో పెళ్ళి చేసుకోవాలని లేదట! కాని, పెద్ద వాళ్ళు గొడవచేసి ఏ వయసుకి తగిన ముచ్చట ఆ వయసులో జరగాలని పట్టుబట్టి అతనిని ఈ పెళ్ళి చూపులకి బలవంతాన రప్పిస్తున్నారట. ఏమిటో అమ్మా నాన్న పిచ్చేగాని ఇంతటి ఆస్తిపరులు తమ సంబంధం ఒప్పుకుంటారా! తనని కాలేజీలో అందరూ అందగత్తెని ఎంతగానో పొగుడుతారు. తాను ఇంటర్‌లో జేరిన క్రొత్తలో తనకి ఎన్నో లవ్ లెటర్స్ వచ్చాయి. వాటిని ఖాతరు చెయ్యకుండా చదువు మీదే దృష్టి కేంద్రీకరించింది. డిగ్రీలోతాను కాలేజీ ఫస్ట్ రావాలని ఎంతో పట్టుదలగా కృషి చేస్తోంది. ఏమౌతుందో. మరి! ఆలోచిస్తూనే మళ్ళీ వాచీకేసి చూసుకుంది కీర్తన. ఇంతలో అటుగా వెళుతున్న తెల్లటి మారుతీ కారు కొద్దిగా ముందుకు వెళ్ళి తనని చూసి ఆగడం గమనించి, మొహం ప్రక్కకు త్రిప్పుకుంది కీర్తన. కారు కిటికీలోంచి కుడిచేతిని ఊపుతూ వచ్చి కారు ఎక్కమన్నట్లు సైగ చేశాడు కారులోని వ్యక్తి.

అమ్మో! ఇంకేమన్నా ఉందా! అసలే మొగవాళ్ళు మంచివాళ్ళు కాదు! అతను మధ్యదారిలో తనని ఏమైనా చేస్తే! భయంతో అసలు అటు చూడకుండా బస్ కోసం సీరియస్‌గా చూడసాగింది. ఆ కారులోనున్న వ్యక్తి చాలా చక్కగా ఒద్దికగా ఖరీదైన బట్టల్లో ఉన్నాడు. దగ్గరిగా నడిచివచ్చి "ప్లీజ్! వేరేగా అనుకోకండి! నా కారులో మిమ్మల్ని డ్రాప్ చేస్తాను. ఈ రోజు-సిటీబస్‌లు లేవుట. ఏదో గొడవ! స్ట్రయిక్ అవుతోంది! బహుశ ఈ రోజు ఒక్క బస్సు కూడా నడవదు. మిమ్మల్ని చూస్తే సాంప్రదాయ కుటుంబం లోంచి వచ్చినట్లున్నారు. అనవసరంగా చిక్కులో పడతారు. నా కారులో మిమ్మల్ని డ్రాప్ చేసి వెళతాను రండి" ఎంతోనమ్రతగా అడిగాడు. ఇదంతా వినేసరికి ఇంత ఇదిగా తనని బతిమలాడ వలసిన అవసరం ఇతనికి ఏమొచ్చింది! పైగా ఎంత కట్టుకథ చెప్పాడు? తనేమన్నా వెర్రి బాగుల్దా? నమ్మి అతని వెంట, కారులో వెళ్ళడానికి. హు! ఎంత అమాయకుడు! తనలో తాను నవ్వుకుని "నో"... "థాంక్స్! నేను బస్‌లో వెళతాను, లేదంటే నడిచి వెళతాను మీరు వెళ్ళవచ్చు" స్పష్టంగా చెప్పింది.

తనని ఆ అమ్మాయి అనుమానిస్తోందని గుర్తించి నెమ్మదిగా కారు దగ్గరికి నడిచి వెళ్ళిపోయాడా వ్యక్తి.

అతను వెళ్ళిన కొద్ది సేపటికి ఇద్దరు వయసు మళ్ళినవారు వచ్చి బస్సు కోసం చూడసాగారు. వాళ్ళ మాటల్ని బట్టి ఇందాకటి వ్యక్తి తనకు చెప్పింది కట్టుకథ కాదని అందులో నిజం ఉందని గ్రహించింది. గంటన్నరపైగా అటుగా ఏ బస్సూ రాలేదని నిర్ధారించుకుని నెమ్మదిగా "ఏమండీ ఈ రోజు బస్సులు లేవా?" అడిగింది. "ఏమో తెలీదమ్మాయ్" అంటూ తనకు తెలిసింది చెప్పాడు ముసలాయన.

ఇందాకటి కారులోని వ్యక్తిచెప్పింది నిజమేననితెలిశాక, బాధపడింది. అప్పటికే టైము ఒంటిగంట కావస్తోంది. ఎల్లా? దిగులు చెందింది. ఇందాక అతని కారులో వెళ్ళినా బాగుండేది అనుకోసాగింది. ఇప్పుడిప్పుడే ఆమెకు అర్థమవసాగింది, అతని మాటల్లో కాని చూపుల్లో కాని ఎక్కడా వెకిలితనం కనిపించలేదని! ఎంతో హుందాగా తనకి లిఫ్ట్ ఆఫర్ చేశాడని! కాని, తనే తొందరపడి వద్దంది. సరే ఏం చేస్తాం? ఇంకా సేపు చూద్దాం! అలా ఆమె ఎంతసేపు నిలబడ్డా ఒక్క బస్సు కూడా ఆ దిశకు రాలేదు. ఆమెలో కంగారు, ఆత్రుత, భయం నిమిష నిమిషానికి ఉధృతమవసాగాయి. ఛీ ఛీ లోకం తీరు బాగాలేదని ప్రతివారినీ అనుమానించి మంచి వాళ్ళ సహాయాన్ని కూడా సకాలంలో పొందలేకపోతున్నాం. తనని, సమాజంలోని కుళ్ళునీ మనుషుల మనస్తత్వాలనీ తిట్టుకోవడం పావుగంట క్రితమే మొదలెట్టింది కీర్తన. సుమారు గంటన్నర తరువాత ఒక మెటడోర్ వెహికిల్ అటుగా రావడం గుర్తించి, చాటంత మొహం చేసుకుని గాబరాగా దానికి అడ్డం పరుగెత్తి లిఫ్ట్ అడిగింది. వాళ్ళు వేరే రూట్ వెళ్ళనున్నట్లు చెప్పారు. అయినా ఫరవాలేదు మెయిన్ రోడ్డు దగ్గర దింపితే అక్కడి నుండి ఎలాగోలా ఆటోలో వెళ్ళవచ్చునని బతిమాలింది. సరేనని ఎక్కమన్నారు వాళ్ళు. కొద్ది దూరంలోనే ఆమెని దింపేసి వెళ్ళిపోయారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆమె మళ్ళీ ఏదైనా ఆటోగాని దొరుకుతుందా? అని చూడసాగింది.

"అమ్మో! మంటలు, మంటలు, తగుల బెట్టేస్తున్నారు" అని కేకలు పెడ్తూ జనం చెల్లా చెదురవుతున్నారు. హాహాకారాల మధ్య వెర్రి పరుగులు తీస్తున్న జన సమూహం, కీర్తనని తోసేస్తూ వెళ్ళింది. నిప్పంటించిన వాహనాలు అగ్ని గోళాల్లా మండుతున్నాయి. ఎక్కడ చూసినా ఏడుపులు, కేకలు! పరిస్థితి చాలా ప్రమాదకరంగా తోచింది కీర్తనకి. ఆమెకు ఏడుపుముంచుకువస్తోంది. తనుసురక్షితంగా ఇంటికి చేరగలదా! తనవాళ్ళను చూడగలదా! హే భగవాన్ ఏమిటి ఈ పరిస్థితి! అసలు ఈ రోజు ఇల్లు కదలకుండా ఉంటే ఎంత బాగుండేది. పోనీ కదిలానే అనుకో! ఇందాకటి మారుతీ కారులో లిఫ్ట్ తీసుకుంటే ఎంత బాగుండేది. ఈపాటికి పెళ్ళి చూపులకి ప్రవీణ్ వచ్చాడో ఏమో! నాన్న చిందులు త్రొక్కుతున్నారో ఏమో! ఏమిటి దారి? అసలు ఇంటికి ఎలా చేరటం? ఆమె మనస్సు పరిపరి విధాల పోతోంది. ఏడుపు బిగబట్టడంతో కళ్ళు ఎర్రబడి, గొంతు నొప్పిగా ఉంది. మొహంలో దైన్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. భయవిహ్వలయై ఒకమూలగా ఒద్దికగా నిలబడింది. ఇంతలో ఇందాకటి తెల్లటి మారుతీకారు దగ్గరగా వచ్చి ఆగింది. "హలో వస్తారా" కారు డోరు తెరిచిపట్టుకుని చిలిపిగా నవ్వుతూ అడిగాడు ఆ వ్యక్తి.

అతన్ని చూసి ఆమె ప్రాణం లేచివచ్చింది.

యుగాల తరబడి నీటికై తపించిన ప్రాణి, నదిలో మునిగినంత సంబరంగా 'థాంక్స్' అని ఒక్క ఉదుటున కారు ఎక్కింది కీర్తన.

ఆమెకు ప్రశాంతంగా ఉంది. ముఖానికి పట్టిన స్వేద బిందువులను అద్దుకోమన్నట్టు తెల్లటి నేప్‌కిన్‌ని అందించాడు. మారు మాట్లాడకుండా అందుకుంది. ఆమెకు మళ్ళీ అతను కనిపించడం కలగా ఉంది. ఇది నిజమేనా? అని తనను గిచ్చుకుని చూసుకుంది. కలకాదని నమ్మింది. 'ఎవరితను'? తనని ఎందుకు అంటి పెట్టుకుని తిరుగుతున్నాడు? మళ్ళీ తనిక్కడున్నట్లు ఎలా తెలిసింది? ఆమెలో ఎన్నో ప్రశ్నల పరంపర. కాని అతని మొహంలో చెరగని చిరునవ్వు. కీర్తనకి అతనిని ఎక్కడో చూసినట్లుగా లీలగా అనిపించింది. అడుగుదామంటే అతను మాట్లాడకుండా కారు నడుపుతున్నాడు. మధ్యమధ్యలో కారు సైడు మిర్రర్ నుండి ఆమెను అతను గమనించడం, ఆమె దృష్టిని దాటిపోలేదు. కొద్ది దూరంలో ఇల్లు వస్తుందనగా ఆమె మామూలయింది. అప్పుడు ఆమెకి అనుమానం కలిగింది. 'తను ఇంటి అడ్రస్ చెప్పనేలేదు! ఇతనికి తన ఇల్లు ఎలా తెలుసు? 'అరె' అంతా చిత్రంగా ఉందే'! కారు తన ఇంటిముందు ఆగేసరికి, ఆమె ఆశ్చర్యానికి బ్రేకు పడక తప్పింది కాదు. కారు చప్పుడవగానే కీర్తన చెల్లెలు రాధ, తమ్ముడు కిరణ్ పరుగెత్తుకు వచ్చి కీర్తనని చుట్టేశారు. ఇంతలో కీర్తన తల్లిదండ్రులు కూడా ఎంతో ఆదుర్దాగా వచ్చి "చాలా 'థాంక్స్ బాబూ!' నిన్ను శ్రమ పెట్టాము" అన్నారు. కీర్తనకి ఇదంతా అయోమయంగా ఉంది. ఇతను అమ్మానాన్నకి ఎలా తెలుసు?' లోపలికి దారితీస్తూ "రండి కాఫీతీసుకు వెళుదురుగాని" అభిమానంతో ఆహ్వానించింది. "పలుకే బంగార మాయనే అనుకున్నాను. మీకూ మాటలొచ్చన్న మాట" అంటూ కారు దిగి, కీర్తన తల్లిదండ్రులకు నమస్కరిస్తూ "ఇంక నేను శలవు తీసుకుంటానండి. అసలే సిటీ బాగాలేదు. ఇంటికి చేరితే మంచిది" నవ్వుతూ అన్నాడా వ్యక్తి.

"అదేమిటి ప్రవీణ్! అమ్మాయి వచ్చింది కదా పెళ్ళి చూపులు అయినాక వెళ్ళొచ్చు! రా నాయనా" కీర్తనకి తండ్రి మాటలు అర్థం కాలేదు. ఆశ్చర్యపోవడమే ఆమె వంతయింది. "ఇంకా పెళ్ళి చూపులేమిటండీ! బస్ స్టాపులోనూ, కారులోనూ చూపులయిపోయాయి. నిజానికి నాకు ఇప్పట్లో పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. అందుకే మీరు పంపిన కీర్తన ఫోటో చూడకుండానే నాన్నగారి ద్వారా మీకు తిప్పి పంపేశాను. కాని కీర్తనని చూశాక నా అభిప్రాయం మార్చుకోక తప్పలేదు. నాకు మీ అమ్మాయి అన్ని విధాల నచ్చింది. ఇక ఆమెని అడిగి ఆమె అభిప్రాయం కూడా తెలుసుకుని నాన్నగారికి తెలియజేయండి. నేను మళ్ళీ త్వరలో ఉత్తరప్రదేశ్ వెళ్ళిపోవాలి." 'వెళ్ళొస్తాను' కొంటెగా కీర్తనకి చెప్పి, కారు డ్రైవింగ్ సీటులో కూర్చున్నాడు ప్రవీణ్. కీర్తన తల గిర్రున తిరిగి నట్లైంది. ఏమిటి? ఇతను తనని చూడడానికి లక్నో నుండి వచ్చిన ప్రవీణా? ఎంత విచిత్రం? ఆమెకు తత్తరపాటుతో మాటరాక అతను కూడా తనకి నచ్చినట్లు మొహం పెట్టి చిరునవ్వుతో అతనికి మాత్రమే కనిపించేట్లు 'టా. టా.' చెప్పింది. ప్రవీణ్ మొహంలో ఆనందం కొట్టొచ్చినట్టు కనపించింది. "సరే బాబూ! ఉంటామయితే, అమ్మాయి అభిప్రాయం కూడా కనుక్కుని, మీ అమ్మా నాన్నగార్లతో మాట్లాడతాము" సాగనంపుతూ అన్నారు కీర్తన తల్లిదండ్రులు.

కారు మలుపుతిరిగాక, అందరూ లోపలికి నడిచారు. "అమ్మా 'నాకిదంతా తమాషాగా ఉంది" కీర్తన తల్లితో అంది

"అవును కీర్తనా! సమయానికి నువ్వు రాలేదు. అతనేమో ఖచ్చితంగా చెప్పిన టైంకల్లా వచ్చేశాడు. మీ నాన్నగారు నువ్వింకా రాలేదని కంగారు పడుతున్నారు. మాటల మధ్యలో సిటీ వాతావరణం బాగాలేదంటూ చెప్పుకొచ్చాడు. ఎంత సేపటికీ నువ్వు రాక పోయేసరికి గాబరా పడుతూ మీ నాన్నగారు, నీకోసం బయలుదేరబోతున్నారు. ఇంతలో టీ.వి. మీదున్న మన ఫామిలీ ఫోటోలో నిన్ను చూసి 'అరె ఈ అమ్మాయి మీ అమ్మయా! ఇందాక బస్టాప్‌లో చూశాను! ఉండండి నేను వెళ్ళి తీసుకువస్తాను' అంటూ బయలుదేరి వెళ్ళి, నీతో తిరిగి వచ్చాడు." ప్రవీణ్ పట్ల కృతజ్ఞతను కనబరుస్తోంది తల్లి. "ఔనమ్మా బస్టాప్‌లో దిక్కు తెలియని స్థితిలో ఉన్న నన్ను గౌరవంగా ఇంటికి చేర్చారాయన" అన్నది కీర్తన. "ఇంతకీ ప్రవీణ్ నీకు నచ్చినట్లేనా కీర్తనా" తండ్రి ప్రశ్నకు సిగ్గుతో ఎర్రబారిన మొహం కనపడకుండా తుర్రున లోపలికి పరిగెత్తింది కీర్తన. రేడియోలో 'రాకోయి అనుకోని అతిథి' సుశీల కంఠం, కీర్తనని ఊహాలోకాల్లో విహరింపజేస్తూ వచ్చింది!

ఎవరెస్ట్ వనిత

ఎవరెస్ట్ లాటి మహోన్నత శిఖరాగ్రాన్ని చేరకున్న వేళ, పట్టలేని ఆనందాన్ని పంచుకోడానికి పక్కన ఎవ్వరూ లేనప్పుడు, మనసు మంచుశిలగా మారిపోతుందంటోంది ఆమె. ముప్పై ఏళ్ళ స్టేసీ ఎల్లిసన్ అనే పోర్ట్‌లెండ్ వనిత, ఇద్దరు పురుష పర్వతాధిరోహకులతో కలిసి ఎవరెస్ట్ శిఖరాగ్రాన్ని చేరుకోవాలని బయల్దేరింది. ఆ బృందం వెంట సహాయకులుగా వస్తున్న షెర్పా జాతి యువకులు సగం దారిలో భయంతో వెనక్కి తిరిగారు. వారి వద్ద వున్న ఆక్సిజన్ చాలా వరకూ ఖర్చయిపోయింది. మిగిలిన దానితో కేవలం ఒక్క మనిషి మాత్రమే శిఖర యాత్ర కొనసాగించగల పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ఎల్లిసెన్, ఆమెతోవచ్చిన మరి ఇద్దరు వ్యక్తులూ లాటరీ వేసుకున్నారు. అందులో ఎల్లిసెన్ పేరు వచ్చింది. పురుషులు వెను తిరిగి పోయేరు. ఎల్లిసెన్ ఒంటరిగానే ఎవరెస్ట్ శిఖరాగ్రం చేరుకుంది. జయప్రదంగా తిరిగి వచ్చిన వనితకి పురుష లోకం జేజేలు పలికింది.

ద్వీపంలో గడియారం

అక్కడ టైమెంతయిందో తెలుసు కోవడానికి చర్చి గంటలు లెక్క పెట్టే అవసరం లేదు. ఫ్రాన్స్ దేశంలో మౌంట్ సెయింట్ మైఖేల్ అనే ద్వీప ప్రాంతంలో లారెంట్ మార్కెట్ దంపతులు చేసిన గడియారం ఏర్పాటు ఇది. అతి చిన్నదైన ఆ దీవిపవు నడిబొడ్డున వున్న గుట్టమీద నిలబడి చూస్తే, వారి దృష్టికి విశాలంగా పరచుకున్న గుండ్రటి ఇసుకపర్ర వాచీ డయల్ కనిపించింది. అంతేకాదు గుట్ట మీదున్న చర్చి శిఖరపు నీడ సూది మొనలా ఆ ఇసుక మీద పడుతున్నప్పుడు వారి భావుకతలో అదొక వాచీ ముల్లుగా గోచరించింది. వెంటనే మార్గెట్ దంపతులు గుట్ట దిగి ఇసుకలో వర్తులాకారంలో రోమన్ అంకెల్నివేసి "సన్ డయల్" ని తయారు చేసి, ఏటి ఇసుకకీ, మేటి శిఖరపు నీడకీ సమయ సఖ్యత కుదిర్చేరు.